హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 120 | పేజీలు : 08 | గురువారం | 07-05-2026 | వెల :4/-
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## నా కాన్వాయ్ కోసం ప్రజలను

# ఇబ్బంది పెట్టకండి

**డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**


2

- ప్రజలను రోడ్లపై గంటల తరబడి నిలబెట్టవద్దన్న రేవంత్ రెడ్డి
- కాన్వాయ్ వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను ఆపేసి ఇబ్బంది పెట్టవద్దన్న సీఎం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ కమిషనర్లకు డీజీపీ సూచన
- కాన్వాయ్ వెళ్లే సమయంలో సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించాలన్న డీజీపీ

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తన కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బందిపెట్టడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో తన పర్యటనల సమయంలో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. ప్రజలను రోడ్లపై గంటల తరబడి నిలబెట్టవద్దని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళుతున్న క్రమంలో విమానాశ్రయం సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.తాను వెళుతున్న క్రమంలో, ట్రాఫిక్ నిలిపివేయడంతో వాహనాలు పెద్ద ఎత్తున ఆగడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని అన్నారు. కాన్వాయ్

# విజయ్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు..

## తీవ్రంగా స్పందించిన డీఎంకే

- కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలో ఇలాగే చేస్తోందన్న డీఎంకే అధికార ప్రతినిధి
- అందుకే వరుసగా అన్ని రాష్ట్రాల్లో ఓడిపోతోందని ఇలంగోవన్ మండిపాటు
- ఢిల్లీ, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయిందని ఆగ్రహం
- పార్టీని మూసివేసుకునే పనులనే కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని వ్యాఖ్య

2



# రైతు డిక్లరేషన్ ఒక నయవంచన

- రైతు సంగ్రామ సదస్సులో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేటీఆర్
- వరంగల్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ రైతు సంగ్రామ సదస్సు
- కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఒక నయవంచన అని వెల్లడి
- రైతుల సంక్షేమం కోసం రేవంత్ ఢిల్లీ నుంచి ఒక్క పైసా కూడా తీసుకురాలేదని విమర్శ


2

## మళ్లీ బాంబుదాడులు

# మొదలవుతాయి

- ఇరాన్ సహకరించకుంటే మళ్లీ బాంబుదాడులు మొదలవుతాయి: ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందన్న ట్రంప్
- ఇరాన్ సహా అందరికీ హర్మూజ్ జలసంధి తెరుచుకుంటుందని వెల్లడి
- లేదంటే గతంలో కంటే భీకరస్థాయిలో బాంబు దాడులు ఉంటాయన్న ట్రంప్


2

# కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు

- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్
- బీఆర్ఎస్ హయాంలో రైతు రుణమాఫీని నాలుగు విభాగాలుగా విభజించారన్న సీతక్క
- రైతు కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ
- బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా ఇచ్చిందని వ్యాఖ్య


2

## ఆమెను బయటకు

# గెంటేయండి

- ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజీనామా చేసేది లేదని మమతా బెనర్జీ స్పష్టీకరణ
- మమత వైఖరి ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాల్ అన్న సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ
- ఎన్నికల ఫలితాల ధ్రువీకరణ తర్వాత ఆమె సీఎం ఆఫీసులో చొరబాటుదారు అని వ్యాఖ్య
- మమతను అవసరమైతే పోలీసులతో ఖాళీ చేయించాలని డిమాండ్

2



## విరాళాలకు కూడా

# లెక్కలు లేవు

- సత్య నాదెళ్ల వంటి వాళ్లు ఇచ్చే విరాళాలకు కూడా లెక్కలు లేవు: కవిత
- కార్పొరేట్ విద్యాసంస్థలు కోట్లు దండుకుంటున్నాయన్న కవిత
- ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని డిమాండ్
- హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ భూములు కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపణ

2



## రైతులకు వేగంగా విత్తన

# సరఫరా చేయాలి

- మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్
- పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం
- వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష

హైదరాబాద్ పల్స్,అమరావతి

ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ

2


## బీఆర్ఎస్ నేత క్రిశాంక్ కు బెయిల్ మంజూరు

2



## హైదరాబాద్

# ఘన విజయం..

**పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి సన్‌రైజర్స్**

- 20 ఓవర్లలో 235 పరుగులు చేసిన హైదరాబాద్
- భారీ లక్ష్యంతో బరిలోకి దిగి 202 పరుగులకే కుప్పకూలిన పంజాబ్
- 107 పరుగులతో రాణించిన కూపర్ కానెల్లీ

2



## మళ్లీ బాంబుదాడులు
# మొదలవుతాయి

మొదటి పేజీ తరువాయి

ఒప్పందానికి ఇరాన్ సహకరిస్తే హర్మూజ్ జలసంధి తెరుచుకుని అంతా ప్రశాంతంగా ఉంటుందని, లేదంటే మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందని అన్నారు. అప్పుడు ఇరాన్ సహా అందరికీ హర్మూజ్ జలసంధి తెరుచుకుంటుందని పేర్కొన్నారు.ఇరాన్ నుంచి సహకారం లేకుంటే మునుపటి కంటే భీకరస్థాయిలో, మరింత తీవ్రతతో బాంబు దాడులు ఉంటాయని హెచ్చరించారు. యుద్ధం ముగింపు దిశగా ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.యుద్ధాన్ని ముగించేందుకు, మరింత వివరణాత్మక అణు చర్చల కోసం ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు రెండు దేశాలు ఓ ఒప్పందానికి చేరువవుతున్నాయంటూ అమెరికా మీడియా సంస్థ ఒకటి తెలిపింది. అణు కార్యక్రమాల తాత్కాలిక నిషేధానికి ఇరాన్ ముందుకు రావడం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు ఎత్తివేయడం, ఇరాన్‌కు చెందిన నిధుల విడుదలకు అమెరికా అంగీకరించడం వంటివి ఈ ఒప్పందంలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

## నా కాన్వాయ్ కోసం
# ప్రజలను ఇబ్బందిపెట్టకండి

మొదటి పేజీ తరువాయి

కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని అన్నారు. కాన్వాయ్ వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా ఆపేసి ప్రజలను ఇబ్బంది పెట్టడమేమిటని ప్రశ్నించారు. అలా చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**డీజీపీ వీడియో కాన్ఫరెన్స్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి పదేపదే మాట్లాడుతున్నారని, ఇది సమస్య తీవ్రతను తెలియజేస్తోందని అన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పటిష్ఠం చేసేందుకు అడిషనల్ డీజీపీ ఆధ్వర్యంలో త్వరలోనే ట్రాఫిక్ బ్యూరో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి విధివిధానాలను రూపొందిస్తున్నామని అన్నారు.ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ముందు సిద్ధం చేసుకోవాలని సూచించారు. విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## హైదరాబాద్
# ఘన విజయం

మొదటి పేజీ తరువాయి

ఐపీఎల్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యాన్ని ఛేధించే ప్రదర్శన కనబరచలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది.పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూపర్ కానెల్లి ఒంటరి పోరాటం చేశాడు. 59 బంతుల్లోనే 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ జట్టులో మిగిలిన ఆటగాళ్లు ఎవరూ రాణించలేదు. ఈ గెలుపుతో హైదరాబాద్ పాయింట్ల పట్టికలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. 11 మ్యాచ్‌లకు గాను 7 మ్యాచ్‌లు గెలిచి 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి పడిపోయింది.

## విజయ్ పార్టీతో
# కాంగ్రెస్ పొత్తు..

మొదటి పేజీ తరువాయి

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడంపై డీఎంకే పార్టీ తీవ్రంగా స్పందించింది. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన కొంతమంది ప్రజాప్రతినిధులు మొదటి నుంచి విజయ్‌కి మద్దతు ఇవ్వాలనే అభిప్రాయంతో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలో ఇలాగే చేస్తోందని విమర్శించారు. ఆ పార్టీ వ్యవహారశైలి కారణంగానే వరుసగా అన్ని రాష్ట్రాల్లో ఓడిపోతోందని అన్నారు.గత సంవత్సరం ఢిల్లీ, ఇప్పుడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని ఆయన మండిపడ్డారు. మహారాష్ట్రలో వారికి ఏమాత్రం అవకాశం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీని పూర్తిగా మూసివేసే పనులనే వారు చేస్తున్నారని విమర్శించారు.

టీవీకే కార్యాలయానికి కాంగ్రెస్ నేతలు

అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే పార్టీతో కాంగ్రెస్ పొత్తు ఖరారు చేసుకుంది. చెన్నైలోని టీవీకే కార్యాలయానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వచ్చారు. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించేందుకు కాంగ్రెస్ నాయకులు సుముఖత వ్యక్తం చేయగా, వారి నిర్ణయాన్ని విజయ్ స్వాగతించారు.

## రైతులకు వేగంగా విత్తన
# సరఫరా చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

## కేసీఆర్ ప్రభుత్వం
# పట్టించుకోలేదు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని ఆమె అన్నారు.కేటీఆర్ తన అహంకారపూరిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రుణమాఫీని నాలుగు విడతలుగా విభజించి రైతులను ఇబ్బంది పెట్టారని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిందని తెలిపారు.గత ప్రభుత్వం పంట బోనస్ హామీని తుంగలో తొక్కితే, తమ ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోందని పేర్కొన్నారు. రైతు బంధు నిధుల విడుదల విషయంలో గతంలో తీవ్ర జాప్యం జరిగేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు.తాము ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నామని, ఫామ్ హౌస్‌లకో లేక ఫారిన్ టూర్లకో పరిమితం కాలేదని కేటీఆర్‌కు చురకలంటించారు. గత ప్రభుత్వంలో జరిగిన కమీషన్ల దందాల గురించి అందరికీ తెలుసని, అటువంటి వారు ఇప్పుడు కమీషన్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోకపోతే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్‌ను సీతక్క హెచ్చరించారు.

## రైతు డిక్లరేషన్
# ఒక నయవంచన

మొదటి పేజీ తరువాయి

వరంగల్ వేదికగా జరిగిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కొనియాడిన కేటీఆర్, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' ఒక నయవంచన అని, అది కేవలం ఓట్ల కోసమే చేసిన 'కొంగజపం' అని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీలను గాలికొదిలేశారని, వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ధ్వజమెత్తారు. కాఝంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్‌ను ఒక బోగస్ చిత్తు కాగితంగా అభివర్ణించిన కేటీఆర్... ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాలను 'దగా మేళాలు'గా సంబోధించారు. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ. 10 వేలు అందిస్తే, రూ. 15 వేలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు కనీసం ఉన్న సౌకర్యాలను కూడా అందించలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ఆక్షేపించారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరిగితే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## విరాళాలకు కూడా
# లెక్కలు లేవు

మొదటి పేజీ తరువాయి

విద్యా రంగంలో పెరుగుతున్న ఫీజుల దోపిడీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి కోట్లు దండుకుంటున్నాయని, వీటిని నియంత్రించకపోతే రాష్ట్రవ్యాప్త పోరాటం చేస్తామని కవిత హెచ్చరించారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా ముఖ్యమంత్రే చూస్తున్నప్పటికీ, స్కూల్ ఫీజులు 50 నుండి 120 శాతం పెరిగినా పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మే నెలలోనే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో ఉన్నట్లుగా శాశ్వత నియంత్రణ అధికారిని నియమించాలని లేదా గుజరాత్ తరహాలో ప్రాథమిక, ఉన్నత విద్యలకు నిర్ణీత ఫీజుల పరిమితిని అమలు చేయాలని సూచించారు.ప్రైవేట్ స్కూళ్ల దోపిడీపై స్పందిస్తూ... గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా ప్రభుత్వం తక్షణమే జీవో విడుదల చేయాలని కవిత కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతి రావు కమిషన్ వేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ స్కూళ్ల ధోరణిని అడ్డుకోవాలన్నారు. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని విద్యాసంస్థలు వ్యాపారం చేస్తున్నాయని, దీనికి రాజకీయ నాయకులే మద్దతుగా నిలవడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వ్యవహారంపై ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ఈ స్కూల్‌లో ఏకంగా 120 శాతం ఫీజు పెంచడం దారుణమని మండిపడ్డారు. స్కూల్ కమిటీలో ఉన్న ప్రభుత్వ పెద్దలు అక్కడి 30 ఎకరాల భూమిని కొట్టేసే కుట్ర చేస్తున్నారని, సత్య నాదెళ్ల వంటి ప్రముఖులు ఇచ్చే విరాళాలకు లెక్కలు లేవని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి వెంటనే సమీక్ష నిర్వహించాలని, లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని కవిత స్పష్టం చేశారు.

## ఆమెను బయటకు
# గెంటేయండి


మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ రాజీనామా చేసేందుకు నిరాకరించడంపై సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమె ప్రవర్తన క్షమించరానిదని, ఇది మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకే విసిరిన సవాల్ అని అభివర్ణించారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.“ఎన్నికల సంఘం ఫలితాలను ధ్రువీకరించిన క్షణం నుంచి ముఖ్యమంత్రి తన పదవిని కోల్పోతారు. అయినా ఆమె కుర్చీకి అతుక్కుపోవాలని చూస్తున్నారు. ఇది అవమానకరం. ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలి. గౌరవంగా రాజీనామా చేయకుండా మొండికేస్తున్నందున, గవర్నర్ తన అధికారాలను ఉపయోగించి ఆమెను అధికారికంగా బర్తరఫ్ చేయాలి. ఆమె ప్రవర్తన దృష్ట్యా, ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలి. ఆఫీస్ నుంచి ఆమెను బయటకు గెంటేయాలి” అని జెత్మలానీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె ఇప్పటికీ కార్యాలయాన్ని ఆక్రమించుకుంటే, గవర్నర్ పోలీసులను పంపి ఖాళీ చేయించవచ్చని సూచించారు. “ఫలితాలు ధ్రువీకరించిన తర్వాత ఆమె సీఎం కార్యాలయంలో ఒక చొరబాటుదారు మాత్రమే” అని స్పష్టం చేశారు.మరోవైపు తాను ఓడిపోలేదని, అందుకే రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేయనని మమతా బెనర్జీ ప్రకటించారు. తన పార్టీ నుంచి 100 సీట్లను దొంగిలించారని ఆమె ఆరోపించారు. దీనిపై జెత్మలానీ స్పందిస్తూ, ఆరోపణలకు ఆధారాలుంటే కోర్టుకు వెళ్లాలని, అక్కడ కూడా ఆమెకు చుక్కెదురయ్యే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. బెంగాల్ అసెంబ్లీ ప్రస్తుత టర్మ్ ఈ నెల 7తో ముగియనుండటంతో ఈ పరిణామాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి.

## బీఆర్ఎస్ నేత క్రిశాంక్ కు
# బెయిల్ మంజూరు

మొదటి పేజీ తరువాయి

కేసు వివరాల్లోకి వెళితే... కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ నివాసం వద్ద గొడవ పడ్డారనే ఆరోపణలపై పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి అదనంగా, 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో కూడా పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి ఆయనను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి అంశాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్, వీటిపై బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.హైకోర్టులో విచారణ సందర్భంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తున్నారని క్రిశాంక్ తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, నిబంధనల మేరకు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలులో జరిగిన అవకతవకలు, మంత్రులపై తాను చేసిన విమర్శల కారణంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని క్రిశాంక్ ఈ సందర్భంగా ఆరోపించారు.



# రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పుష్కర బ్రహ్మోత్సవాలు

## ఆహ్వాన పత్రిక ను ఆవిష్కరించిన ఉత్సవ కమిటీ చైర్మన్ రాచకొండ స్వామి


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పాదాల చెంత నుండి అతి చెరువులోనున్న రఘునాథపురం లో వేంచేసియున్న కలియుగ ప్రత్యక్ష దైవం కోరిన కోరికలు తీర్చే కోనేటి రాయుడు, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించబోయే శ్రీ స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారం పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యుల భక్తుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాసచార్యులు శ్రీ స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభ పత్రికలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ వైస్ చైర్మన్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాచకొండ స్వామి ఆలయ కమిటీ సభ్యుల భక్తుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభ పత్రికను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ రాచకొండ స్వామి మాట్లాడుతూ జూన్ 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించబోయే శ్రీ స్వామివారి ద్వాదశ పుష్కర బ్రహ్మోత్సవం శ్రీ స్వామి వారి ఆలయ శిఖరం పై సుదర్శన చక్రం ప్రతిష్ట, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం, మహా అన్నప్రసాద కార్యక్రమలు, గ్రామస్తులు మరియు దేవాలయ కమిటీ సహాయ సహకారంతో శ్రీ స్వామివారి పుష్కర



బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవముగా ఈ పుష్కర ఉత్సవములు నిర్వహించడం జరుగుతుందని కావున భక్తులు అధిక సంఖ్యలో ద్రవ్య దాన, శ్రమ దాన, భగవధ్యానాదులు ప్రకటించి శ్రీ స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవాలలో పూజ కైంకర్యాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీ స్వామివారి అమ్మవార్ల తీర్థ ప్రసాదంతో పాటు వారి అనుగ్రహమునకు పాత్రులై నిరంతరం స్వామి సన్నిధిలో నిత్య పూజలతో ఆనందం పొందుతూ భక్తులెల్లరు శ్రీ స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవ కార్యక్రమాలను తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు భోగా లక్ష్మీనారాయణ, బొద్దుల వెంకటేశం, గాడిపెల్లి శ్రవణ్ కుమార్, వల్లకాటి బాబురావు, సామల భాస్కర్, బింగి శివరాజ్, చింతపండు శ్రీధర్ రావు, ఉప్పల రమేష్, కటకం సంతోష్, బీతోజు వెంకటేశం, చెన్నా బాల సిద్ధులు, వెంగల్ దాస్ యాదగిరి, మహేశ్వరం సుధాకర్, కటకం గణేష్, మదూరి బాలయ్య, చేన్న నర్సింగరావు, మహేశ్వరం దయాకర్, బల్ల నాగభూషణం లోక శ్రీనివాస్, వీరబత్తిని విజయ్, బల్ల వివేక్, లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పింఛన్ బాంచన్... కళ్ళు పోయిన కబోది

## కలెక్టర్ మానవా దృక్పథంతో స్పందిస్తేనే సమస్యకు పరిష్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట ఒకప్పుడు మంచిగ బతికాడు.. సర్పంచ్ గా పోటీ చేసి ఓటమిపాలయ్యాడు. కాలక్రమేన అప్పుల ఊబిలోకి నెట్టివేయబడి దీన స్థితిలోకి చేరుకున్నాడు. మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన చేనేత పవర్ లూమ్ కార్మికుడు మద్ది జనార్ధన్ ప్రస్తుతం దిన దిన గండంగా బతుకుతున్నాడు. గతంలో భార్య చంద్రకళతో పాటు నలుగురు కుమార్తెలు. తనకున్న దాంట్లో నలుగురు కుమార్తెల వివాహం జరిపించారు. వారు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. బతుకుదెరువు కోసం రెండు దశాబ్దాల క్రితం భువనగిరికి వలస వెళ్లాడు. అక్కడే అద్దెకు ఉండి జీవనం సాగిస్తున్న తరుణంలో భార్య చనిపోయింది. మూడేళ్ల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చి పెంకుటింట్లో ఉంటున్నాడు. భువనగిరిలో ఉంటున్న క్రమంలో మంజూరైన ఆసరా పింఛను సొమ్ముతో బతుకుతున్నాడు. కాలక్రమేణా కంటిచూపు కోల్పోవడం, చెవులు వినపడకపోవడం, అప్పుడప్పుడు మతిస్థిమితం తప్పడంతో కష్టాలు మొదలయ్యాయి.

**చూపు పోయి... పెన్షన్ పోయి..**

జనార్ధన్ దీనస్థితికి చలించిన స్థానికులు తలా ఇంత పోగుచేసి రూ.60 వేలతో కంటి చికిత్సకు హైదరాబాద్లోని ప్రైవేటు ఆసు పత్రికి తీసుకెళ్లారు. కళ్లను పరీక్షించిన అక్కడి వైద్యులు నరాలు పూర్తిగా చచ్చుబడి పోయా యని, శాశ్వతంగా కంటి చూపు రాదని తేల్చిచెప్పారు. కంటిచూపు లేని కారణంగా మూడు మాసాల పాటు పింఛను సొమ్ము భువనగిరికి వెళ్లి తెచ్చుకోవడా నికి వీలు కాలేదు. తపాలాశాఖ కార్యాలయానికి వెళ్లి పింఛను సొమ్ము కోసం వాకబు చేయగా వరసగా మూడు నెలల పింఛను సొమ్ము తీసు కోని కారణంగా ఖాతా నెంబరు 408346లో జమ కావడం లేదు. 80 ఏళ్ల వయసులో చూపు కోల్పోయి పింఛన్ పునరుద్ధరణ కొరకు కోసం ఏ కార్యాలయానికి తిరగాలో తెలియక, యూడిఐడి సర్టిఫికెట్ ఎలా తీసుకోవాలో తెలియక తన వారి సాయం లేక అయోమయంలో బతుకుతున్నాడు. పెన్షన్ ఉన్న ఒక్క ఆధారం కోల్పోవడంతో ఆయన పరిస్థితి దయనీయంగా మారింది. స్థానికులతో పాటు లక్ష్మి ఏడాదిగా భోజనం అందిస్తున్నారు. కలెక్టర్ స్పందించి మానవాత దృక్పథంతో దివ్యాంగ లేదా వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని చల్లూరు వాసులు కోరుతున్నారు.



# ప్రజలపై నిత్యావసర భారాలు మోపుతున్న కేంద్రం

**పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06 భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశప్రజలకోసం కాకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుండంవల్లే సామాన్య ప్రజలపై నిత్యావసర భారాలు విపరీతంగా పెరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా కూనంనేని మాట్లాడుతూ ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలతో సామాన్యుడి వంటిల్లు మండుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిత్యావసరాల ధరల నివారణకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టకుండా, కార్పొరేట్ శక్తుల దోపిడీకి ఎర్రటి తివాచీ పరుస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థను అటకెక్కించి పేదల నోటికాడ కూడును లాగేస్తున్నారని, వెంటనే పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఇంధన కొరతపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికే లేదని, ఇప్పటికైనా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సామాన్యుడి గొంతుకై నిలబడతామని, ఈ పోరాటాలను గ్రామ గ్రామానికి



ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, ఎస్ కె ఫహీమ్, దీటి లక్ష్మీపతి, కె రత్నకుమారి, మునిగడప పద్మ, కార్పొరేటర్లు, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# సాంప్రదాయంగా ప్రారంభమైన ప్రతిష్ట మహోత్సవం పూజలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం గణపతి పూజతో ప్రతిష్ట మహోత్సవ పూజా కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా మొదలయ్యాయి. అభయాంజనేయ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు భక్తులు పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ చలివేదుల రాజేశ్వర శర్మ, జోషి మల్లకార్జున శర్మ బృందం కార్యక్రమాన్ని శాస్త్రబద్ధంగా ఆరంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం మొదటిరోజు బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్వికరణం, అఖండ దీపారాధన, దేవత ఆహ్వానం, గణపతి హోమం, సాయంత్రం జలాధివాసం, నీరాజనం మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. గురువారం జరిగే పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చలివేదుల రాజేశ్వర శర్మ వివరించారు. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, సూర్యనారాయణ మూర్తి, సంతాన నాగేంద్ర స్వామి విగ్రహల ప్రతిష్ట మహోత్సవం చివరి రోజు శుక్రవారం జరుగుతుందని వివరించారు. పూజా కార్యక్రమంలో అధ్యక్షులు బెడిద నర్సిములు, జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు సోమసాని రాజ మల్లయ్య దంపతులు పాల్గొన్నారు. దాతలు గ్రామస్తులు భక్తులు పెరిక కుల సంఘ సభ్యులు పెద్దలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణం పచ్చని తోరణాలు, పూలమాలలు, ప్రత్యేక పందిళ్ళతో ముస్తాబు చేశారు.



# వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లెల శ్రీశైలం, బండ బీరయ్య ఎన్నిక





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** కూరెళ్ళ గ్రామంలో మంగళవారం జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూరు మండల మహాసభలో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లెల శ్రీశైలం, బండ బీరయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి అన్ని గ్రామాలలో సేద్యం చేసుకుంటున్నా ప్రభుత్వ భూములకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ ఎనిమిది వందల రూపాయలు ఇవ్వాలని, జిరామ్ జి చట్టాన్ని రద్దుచేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీలో 200 రోజుల పని దినాలు కల్పించి, పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, తాగడానికి నీళ్లు, మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కూడా కూలీలకు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని తీర్మానం చెయడం జరిగింది. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా తుమ్మలగూడెం యాదయ్య, పొన్నం అండాలు, సహాయ కార్యదర్శులుగా కూరెల్ల నాగయ్య, గాజుల ఎల్లయ్య మిగతవారిని కూరెళ్ల యాదయ్య, పొనగాని బిక్షపతి, నాయిని పుల్లారెడ్డి, కన్నబోయిన అంజయ్య ను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా టి.ఎల్. సంగీత పదవీ బాధ్యతలు స్వీకారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా టి.ఎల్. సంగీత బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పదవీ బాధ్యతలు చేపట్టగా, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయగా, ఆమె అధికారులతో సన్నిహితంగా పరిచయం చేసుకుని శాఖల వారీగా జరుగుతున్న పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టి.ఎల్. సంగీత మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థంగా చేరేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని పేర్కొన్నారు.

# బ్యాంకుల ద్వారా రైతులకు సేవలు...



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : బ్యాంకుల ద్వారా రైతులకు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలు సందర్భంగా బుధవారం పీఏసీఎస్ రేణికుంటలో డీసీసీబీ బ్రాంచ్ రాజపేట సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి పీఏసీఎస్ రేణికుంట చైర్మన్ చింతలపురి భాస్కర్ రెడ్డి, పాలకవర్గం, వివిధ గ్రామ సర్పంచులు జాన్నెపల్లి బాలరాజ్ రెడ్డి, మడోత్ రాంజీ, పులి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిలివేరు బాలరాజు, వివిధ గ్రామల రైతులు, మండల నాయకులు మరియు డిడిసిసిబి బ్రాంచ్ మేనేజర్, మండల ఏఓ, ఏఈఓ లు సంఘ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు

## పేటెంట్ సాధించిన విద్యార్థిని అభినందించిన సిర్పూర్ (టి) శాసనసభ్యులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన విద్యార్థిని అల్సా మమత రూపొందించిన పార్కింగ్ నిర్వహణ ప్రాజెక్టుకు పేటెంట్ లభించిన సందర్భంగా సిర్పూర్ (టి) నియోజకవర్గం శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ఆయన నివాసంలో విద్యార్థినిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి : జిల్లా కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానపల్లి మండలం గంగాపూర్‌లోని బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హరిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు రిజిస్టర్, మందుల నిల్వ గది, వార్డులు, పరిసరాలు పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఎండదెబ్బ బాధితులకు వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు ప్రతిరోజు గ్రామాలు సందర్శించి గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం కలెక్టర్ దిందా గ్రామ సమీపంలో ప్రాణహిత నదిని పరిశీలించి నీటి ప్రవాహ వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెన పనులను పరిశీలించి నాణ్యత పాటిస్తూ శరవేగంగా పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. వంతెన పూర్తయిన తర్వాత గ్రామస్థుల దీర్ఘకాల రవాణా సమస్య తీరుతుందని తెలిపారు.

## చెక్‌పోస్ట్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి : కలెకర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. బుధవారం సిర్పూర్ (టి) మండలం పెద్దబండ చెక్‌పోస్ట్ ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. యాసంగి ధాన్యం కొనుగోలు సీజన్ నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుండి వరి ధాన్యం అక్రమ రవాణా జరిగే అవకాశముందని హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని, రాబోయే ఖరీఫ్ సీజన్‌లో నిషేధిత పత్తి విత్తనాలు, కలుపు మందుల రవాణాపై కూడా విస్తృత తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

## నూతన దంపతులక పలువురి పెద్దల ఆశీర్వాదం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన వారణాసి రాకేష్ వివాహం బుధవారం జరగగా కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, చెల్మిడి వెంకటేష్ తదితరులున్నారు.

## ప్రభుత్వ ఏర్పాటులో విజయ్‌కు షాక్.. పర్మిషన్ ఇవ్వని గవర్నర్



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, సెంట్రల్ డెస్క్: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన 'తమిళగ వెట్రి కళగం' ప్రభుత్వ ఏర్పాటులో కీలక అడ్డంకిని ఎదుర్కొంటోంది. మెజారిటీకి అతి సమీపంలోకి వచ్చినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తమిళనాడు గవర్నర్ నుంచి విజయ్‌కు అనుమతి లభించలేదు. మ్యాజిక్ ఫిగర్ విషయంలో విజయ్ ఇచ్చిన వివరణపై గవర్నర్ సంతృప్తి చెందకపోవడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

**ఆగిన విజయకేతనం: 112 వద్దే మద్దతు**

తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా.. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్పష్టమైన మెజారిటీ 118. అయితే.. ప్రస్తుత లెక్కల ప్రకారం విజయ్‌కు 112 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని క్లెయిమ్ చేసిన విజయ్, ఆరుగురు ఎమ్మెల్యేల లోటును భర్తీ చేసే విషయంలో గవర్నర్‌ను ఒప్పించలేకపోయారు. రాజ్యాంగ నిబద్ధత ప్రకారం సంపూర్ణ మెజారిటీ ఉంటేనే ప్రమాణ స్వీకారానికి అనుమతిస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. "ప్రభుత్వ ఏర్పాటుకు ఖచ్చితంగా 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండాల్సిందే" అని ఆయన తేల్చి చెప్పారు. తన వద్ద ఉన్న బలాన్ని నిరూపించుకోవడంలో విజయ్ విఫలం కావడంతో, ప్రస్తుతానికి ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది.

**ముందుకు రానున్న ఇతర పార్టీలు?**

విజయ్‌కు మెజారిటీ లభించని పక్షంలో.. గవర్నర్ ఇతర పార్టీలైన ఏఐడీఎంకే లేదా డీఎంకే కు అవకాశం ఇస్తారా? లేక హంగ్ అసెంబ్లీ దిశగా పరిస్థితులు దారితీస్తాయా? అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. మరోవైపు.. స్వతంత్రులు లేదా ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టేందుకు టీవీకే శ్రేణులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో తమిళనాట రాజకీయాలు ఒక్కసారిగా అనిశ్చితిలోకి వెళ్లాయి. విజయ్ తన తదుపరి అడుగు ఎలా వేయబోతున్నారన్నదానిపైనే యావత్ దేశం ఫోకస్ పెట్టింది.

## గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదలపై సిపిఐ నిరసన



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట కేంద్ర ప్రభుత్వం పేదలపై కపట ప్రేమ చూపిస్తున్నదని ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు ముగియగానే ధరలు పెంచి పేద ప్రజలపై భారం మోపిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలపై సిపిఐ నేతలు బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మాట్లాడుతూ పెరుగుతున్న ఇంధన ధరలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని, పెట్రోల్, డీజిల్ ధరలు అధిక స్థాయిలో కొనసాగుతుండటంతో రవాణా ఖర్చులు పెరిగి సాధారణ ప్రజలపై నిత్యావసర సరుకుల భారం పడుతోందన్నారు. అనంతరం తహసిల్దార్ కు వినతిపత్రం అందచేశారు. తరిగొప్పుల సిద్దులు, గంధమల రాజయ్య, గొల్లూరి రాములు, పాముకుంట రమేష్, గుంటి యాదగిరి పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆలేరు మండలం, కొలనుపాక గ్రామంలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బిఆర్ఎస్ ఆలేరు మండల పార్టీ అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఆయన తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేదల బెదరబోయిన యాకమ్మ వెంకటేష్, మాజీ మదర్ డైరీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ ఆరె మల్లేష్ గౌడ్, మాజీ ఎంపిటిసి మామిడాల అంజయ్య, మదనపల్లి మాజీ సర్పంచ్ కోటగిరి పాండరీ గౌడ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు జంగస్వామి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్ రెడ్డి రఘుపతి రెడ్డి, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు మామిడాల భానుచందర్ వార్డు సభ్యులు బొంకూరు మల్లేష్, బల్లెపు సంపత్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందించిన జీఎంర్ ఫౌండేషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06 నారాయణ ఖేడ్ :** కంగ్టి మండలం బోర్గి తండాలో నిన్న నిరుపేద కుటుంబానికి చెందిన తల్లి ఇద్దరు కూతుర్లు బట్టలు ఉతకడానికి వెళ్లి బావిలో పడి చనిపోయిన విషయం జీఎంర్ ఫౌండేషన్ చైర్మన్ బి ఆర్ యస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ దృష్టికి రాగానే వారి అంత్యక్రియలను కొంత ఆర్థిక సహాయాన్ని జీఎంర్ ఆదేశాల మేరకు జీఎంర్ సోదరుడు మాజీ సొసైటీ చైర్మన్ గుఱ్ఱపు జెలేందర్ అందించారు. వారితోపాటు దామరగిద్ద మాజీ సర్పంచ్ శంకర్ సాగర్, సిర్గాపూర్ మండలం బి ఆర్ యస్ పార్టీ నాయకులు బస్వరాజ్ పటేల్, మార్డి గ్రామ బి ఆర్ యస్ పార్టీ సీనియర్ నాయకులు గుఱ్ఱపు జ్ఞానేశ్వర్, మార్డి బి ఆర్ యస్ పార్టీ ఉపాధ్యక్షులు కర్ణం రాజు, నాయకులు గుఱ్ఱపు బాలరాజ్, యువ నాయకులు నమిల్ల హనుమన్లు తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జిల్లాలో అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, అదనపు ఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి పాల్గొన్నారు. ఏప్రిల్ 1 నుండి అమలవుతున్న 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ బుకింగ్ విధానం ద్వారా ఏప్రిల్‌లో 6,852 ట్రాక్టర్ల ఇసుక తరలింపు ద్వారా ?18.50 లక్షలు, మే 5 వరకు 883 ట్రాక్టర్ల బుకింగ్ ద్వారా ?2.48 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. జిల్లాలో 27 చోట్ల ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా మాత్రమే ఇసుక తీసుకోవాలని తెలిపారు. అక్రమ తరలింపుపై రాత్రిపూట తనిఖీలు చేపట్టాలని, డ్రోన్ల ద్వారా వాగుల్లో అక్రమ వాహనాలను గుర్తించాలని ఆదేశించారు. సమావేశంలో పోలీస్, రెవెన్యూ, గనుల శాఖ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో బయో-టెర్రర్ కుట్ర.. డాక్టర్‌తో సహా ముగ్గురిపై ఎన్ఐఏ చార్జ్‌షీట్!



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, సెంట్రల్ డెస్క్: తెలంగాణలోని హైదరాబాద్ లో వెలుగు చూసిన బయో-టెర్రర్ కుట్ర కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్‌కు చెందిన చైనా మెడికల్ గ్రాడ్యుయేట్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్, తన ఇంటినే ఒక రహస్య ప్రయోగశాలగా మార్చి 'రిసిన్' అనే అత్యంత ప్రమాదకరమైన బయో-టాక్సిన్‌ను తయారు చేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఆముదం గింజల నుంచి తీసే ఈ విషం అత్యంత ప్రాణాంతకమైనది. దీనిని రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో ప్రయోగించి భారీ స్థాయిలో ప్రాణనష్టం కలిగించాలని ఐసిస్ హ్యాండ్లర్ల ఆదేశంతో నిందితులు ప్లాన్ చేశారు. నవంబర్ 2025లో గుజరాత్‌లోని ఒక టోల్ ప్లాజా వద్ద నిందితుడి కారులో ఆయుధాలు, ఆముదం నూనె పట్టుబడటంతో ఈ కుట్ర బయట పడింది.ఈ కుట్రలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆజాద్, మొహమ్మద్ సుహెల్ అనే మరో ఇద్దరు నిందితులు కూడా పాల్గొన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. వీరు రాజస్థాన్ నుండి ఆయుధాలు, నిధులను సేకరించి మొహియుద్దీన్‌కు అందించేవారు. ఈ ఘోరానికి ఒడిగడితే మొహియుద్దీన్‌ను దక్షిణాసియా ఐసిస్ 'అమీర్'గా నియమిస్తామని విదేశీ హ్యాండ్లర్లు వాగ్దానం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులు ఇప్పటికే ఢిల్లీ, లక్నో, అహ్మదాబాద్ వంటి నగరాల్లో రెక్కీ నిర్వహించినట్లు ఆధారాలు లభించాయి. నిందితులపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేసిన ఎన్ఐఏ, అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించింది.

# నారాయణఖేడ్‌లో బాల సాధన భవన ప్రారంభం, దివ్యాంగులకు స్కూటీల పంపిణీ



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, నారాయణఖేడ్ : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో నిర్వహించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షేట్కార్, నారాయణఖేడ్ శాసనసభ్యుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన బాల సాధన భవనాన్ని ప్రారంభించి, ప్రభుత్వం తరపున మంజూరైన దివ్యాంగుల త్రిచక్ర వాహనాలు (స్కూటీలు) లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలు,దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా పాలన లక్ష్యమని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి కె లలిత కుమారి, సంబంధించి అధికారులు,రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్



నగేష్ కుమార్ షేట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వస్పరి ప్రశాంతి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

## మంత్రి దామోదర్ రాజనర్సింహ

**త్వరలో ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ పట్టణంలోని బాలసదనంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని బాలసదనం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టామని, మల్టీపర్పస్ ఏఎన్ఎంలు మరియు నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం, మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాలసదనాలు మరియు అంగన్వాడీల అభివృద్ధిని ప్రభుత్వ నిధులు, సిఎస్ఆర్ నిధులతో చేపడతామని వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణం, ఖాళీ ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను మంత్రి అభినందించారు. అనంతరం బాలసదనం బాలికలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్,మున్సిపల్ చైర్మన్ నాగేష్ కుమార్



షేట్కార్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్, సీడీపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పటాన్ చెరు ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో రైతు వారోత్సవాలు

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివనందం, వైస్ చైర్మన్ రాజశేఖర్.**

**13 కోట్లతో పెండింగ్ నిర్మాణాలకు పునఃప్రారంభం**

**ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06 :** పటాన్‌చెరు ప్రాంతంలోని వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులకు కొత్త ఊపు వచ్చింది. సుమారు 13 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. చైర్మన్ శివనందం మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ నాయకత్వం నిర్మాణ పనులను పునఃప్రారంభించింది.ఈ సందర్భంగా మార్కెట్ బాధ్యులు మాట్లాడుతూ, ఇంతకాలంగా నిలిచిపోయిన పనులు ఇకపై ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.చెర్మన్ శివనందం మరియు వైస్ చైర్మన్ రాజశేఖర్, ముఖ్యంగా వ్యాపారులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్ అభివృద్ధి పనులు పూర్తయితే రైతులకు సరుకుల అమ్మకాల్లో సౌలభ్యం కలగడమే కాకుండా, వ్యాపార కార్యకలాపాలు మరింత సజావుగా సాగుతాయని అభిప్రాయం వ్యక్తమైంది.నిర్మాణ పనుల బాధ్యత వహిస్తున్న కాంట్రాక్టర్‌కు స్పష్టమైన గడువు విధిస్తూ, ఆరు నెలల్లోపు అన్ని పనులను పూర్తి చేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. చైర్మన్ శివనందం పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశను పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్‌కు సంబంధించిన వివిధ విభాగాల ప్రతినిధులు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు. అభివృద్ధి పనులు పూర్తి అయితే మార్కెట్ రూపురేఖలు పూర్తిగా




మారిపోతాయని, ప్రాంతీయ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు, ఈకార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ లు సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ గెలుపు దిగ్భ్రాంతికరం..

## ఈ తరహా మార్పులు దేశానికే ప్రమాదకరం: జయప్రకాశ్ నారాయణ

**తమిళనాడు ఎన్నికల్లో విజయ్ గెలుపుపై జేపీ కీలక వ్యాఖ్యలు**

**జన్ జీ కోరుకుంటున్న మార్పులు దేశానికే ప్రమాదకరమన్నారు.**

**విజయ్ గెలుపు దిగ్భ్రాంతికరం..**

**ఈ తరహా మార్పులు దేశానికే ప్రమాదకరం: జయప్రకాశ్ నారాయణ**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, సెంట్రల్ డెస్క్: ఇటీవల వెల్లడైన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు.. యావత్ దేశాన్నీ ఆశ్చర్యానికి గురిచేశాయి. ఊహించని రీతిలో విజయ్ టీవీకే పార్టీ (తమిళగ వెట్రి కళగం) అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. రేపు విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం కూడా చేయనున్నట్లు తెలుస్తోంది. తమిళ రాజకీయాల్లో సంచలనం రేపిన విజయ్ అండ్ పార్టీ విజయంపై లోక్ సత్తా పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ పెట్టిన రెండేళ్లకే విజయ్ సీఎం పీఠాన్ని చేరుకుంటాడని తాను ఊహించలేదన్నారు. ఈ ఫలితాలు చూసి తాను చాలా దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఓ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు.తమిళనాడులో మంచి పాలన అందిస్తున్న స్టాలిన్ ఘోర ఓటమి పాలవ్వడంతో తాను షాకయ్యానని తెలిపారు. ప్రజలు విజయ్ వైపు మొగ్గుచూపడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ముఖ్యంగా జన్ జీ తరానికి చెందిన యువత.. వెంటనే అద్భుతాలు జరిగిపోవాలని ఆశిస్తున్నారని, ఒకే ఒక్కడు సినిమాలో హీరో అర్జున్ ఒక్కరోజులోనే అన్నీ మార్చేసినట్లు.. రియల్ లైఫ్ లోనూ క్షణాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారన్నారు. ఈ తరహా ఆలోచనా విధానం చాలా ప్రమాదకరమని, అభివృద్ధికి సమయం పడుతుందన్నారు. మార్పు కోరుకోవడం మంచిదే అయినా.. అది వెంటనే



జరగాలనుకోవడం దేశానికి మంచిది కాదన్నారు. ఇక స్టాలిన్ ఓటమి వెనుక కుట్రలు, వ్యూహాలు ఉండి ఉండొచ్చన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ పరిణామంపై ఆత్మవిమర్శ చేసుకోవాలని, లేదంటే దేశం ప్రమాదంలో పడుతుందని స్పష్టం చేశారు.

# అమ్మనాన్నల స్మృతిలో ప్రజా సేవ: నీలం మధు ముదిరాజ్..

**చిట్కుల్‌లో ఘనంగా నీలం రాధ-నిర్మల్ వర్ధంతి వేడుకలు**



పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06 : కన్నవారు చూపిన సేవా మార్గంలో నడుస్తూ, వారి జ్ఞాపకాలను ప్రజల గుండెల్లో సజీవంగా ఉండేలా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. కరోనా ఆపత్కాలంలో ఒక్కరోజు వ్యవధిలో మరణించిన తన తల్లిదండ్రులు స్వర్గీయ నీలం రాధ, నిర్మల్ గార్ల 5వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ తన తల్లిదండ్రుల కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి భావోద్వేగంతో నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణ, నలుగురికి సాయం చేయాలనే తపనే నేడు తనను ప్రజా క్షేత్రంలో నిలబెట్టాయని గుర్తు చేసుకున్నారు. పదవులు ఉన్నా లేకున్నా, సామాన్యుడి కష్టాల్లో తోడుండటమే తల్లిదండ్రులకు తాను ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన స్పష్టం చేశారు. తన తల్లిదండ్రుల స్మారకార్థం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు, నీలం అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో నీలం మధు ముదిరాజ్ కుటుంబం ముందుంటుందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీలం మధు కుటుంబ సభ్యులతోపాటు ఆయన అభిమానులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాదులోని నాగారంలో జరిగిన భువనగిరి మున్సిపల్ 25వ వార్డ్ కౌన్సిలర్ బెండ లాల్ రాజ్, స్వరూప ల కుమారుడు సిద్ధార్థ వివాహం సందర్భంగా భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది, ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ కౌన్సిలర్లు, మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తీవ్ర ఎండలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**చిన్న గూడూరు ఎస్ఐ కుశకుమార్ హెచ్చరిక**





**హైదరాబాద్ పల్స్, మే 06, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని చిన్నగూడూరు సబ్ ఇన్స్పెక్టర్ కుశకుమార్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వృద్ధులు, చిన్నపిల్లలు అత్యవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని ఆయన తెలిపారు. మీడియాతో మాట్లాడిన ఆయన, వేసవి సెలవుల సమయంలో చిన్నారులు చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లి ఈత కొట్టే ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. అనుకోని ప్రమాదాలు చోటుచేసుకుంటే తల్లిదండ్రులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, అందువల్ల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రమాదకర ప్రాంతాలకు పిల్లలను వెళ్లనివ్వకుండా చూసుకోవడం ద్వారా అనేక అపాయాలను నివారించవచ్చని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రజలు సురక్షితంగా ఉండవచ్చని ఎస్ఐ కుశకుమార్ స్పష్టం చేశారు.

# అక్రమ వెంచర్ పై యదేచ్చగా అబద్ధాలు.....

**600 మంది అమాయకుల నుండి**
**రూ.100 కోట్లు స్వాహా**
**నాలుగు కంపెనీల పేరున వెంచర్**
**మంజూరి అయిన ఉత్తర్వులు**
**గ్రామపంచాయతీ జారీ చేసిన నోటీసు**
**డిటిసిపి చరిత్రలో అయిన మొదటి వెంచర్**
**ఒక్కటి కాదు నాలుగు కంపెనీలు**
**ఆధారాలు ఇవ్వకుండా దాగుడుమూతలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : రాజపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని 322 సర్వే నెంబర్ లో మూడు కంపెనీల పేర్లతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని 600 ప్లాట్లు చేసి అమాయకుల నుండి 100 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి మోసం చేసినారు. గత నెల 21వ తేదీ సంబంధిత వ్యక్తులమని చెబుతూ మీడియా ముందుకు వచ్చిన పలువురు ఎలాంటి పత్రాలు చూపకుండా మాట్లాడడంతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ వెంచర్ కొనసాగుతున్నట్లు అందరూ నిర్ధారించుకున్నారు. 600 ప్లాట్లను విక్రయించి సుమారు 100 కోట్ల రూపాయలు కాజేసినట్లు దీంతో సొంత ఇంటి కల నెరవేరేందుకు నానా తిప్పలు పడి డబ్బులు చెల్లించిన 600 కుటుంబాలు రోడ్డున పడినట్లు అర్థమవుతుంది. కాగా చల్లూరు అక్రమ క్రషర్ వెంచర్లపై ఉన్నత స్థాయి అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


PHONE : 040-23314622
FAX : 040-23313176
E-MAIL : dtcp@telangana.gov.in

GOVERNMENT OF TELANGANA

From
The Director of Town and Country Planning,
640 A.C.Guards,
4th & 5th Floors,
HYDERABAD - 500 004.

To
1. Sri. K. Srinivasa Rao
Managing Partner, M/s Sreekar Homes and Developers,
Yadadri District.

Lr.Roc.No. 2008/2020/H, Dt. 30-09-2020.

Sir,

Sub:- O/o DT&CP Hyderabad - Dathalpally Grampanchayat, Thurkapally (M), and Challuru Grampanchayat, Rajapet Mandal, Yadadri Bhuvanagiri District - representation of K. Srinivas -Reg.

Ref:- 1. Lr. No. 56/2019/DTCPO/YDRB, dt. 18.05.2019 of DTCPO Yadadri - Bhuvanagiri.
2. DT&CP Hyderaba Lr. No. 2259/2019/H, dt. 19.06.2019.
3. Lr.No. Nil dated .07.2020, representation of Sri. K. Srinivas Rao.
4. Lr. No. Nil dated .09.2020, representation of M/s Sreenadh Infra Projects India Pvt. Ltd. rep by. its Managing director K. Nageswar Rao.
5. OS. No. 17/2020 in the file of 5th additional district judge Yadadri.-Bhuvanagiri District.
6. DTCPO Yadadri Lr. No. 57/DTCPO/2019/YDRD dated 29.09.2020.
7. T/o Lr. No. 2008/2020/H, dated 28.09.2020.

-:oOo:-


With reference to above subject & reference cited, it is to inform that basing on the proposals forwarded by Panchayat Secretary, Dathalpally Grampanchayat, Thurkapally (M), and Challuru Grampanchayat, Rajapet Mandal & field inspection report made by DTCPO Yadadri-Bhuvangiri District and after verifying the ownership documents, LCC proceedings and ADSLR demarcation certificate etc. this office have technically approved the draft Technical approved Pattern (DTLP) in Sy.No's. 322/4/JA/7, 322/4/JA/8, 322/4/JA/9, 322/4, 211/322/4/CHA, 55, 56, 32/A, 27,30/A/2,207 & 322/4 belongs to M/s. Srie Constructions & Developers represented by its Managing Partners Sri. K. Yashwanth Srinivas , Sri. Ch. Sri Krishna Rajeshwari, M/s. R.R. High Energetics Ltd. represented by its Chairman and Managing Director Smt. Janyanthi Kannan & M/s. Sreekar Homes represented by its partners Sri. K. Srinivas rao, this office has Technically approved DTLP to an extent of AC.70-24.Cents and communicated to Panchayat Secretaries for execution of Layout as per provisions of section 113 of Telangana Panchayath Raj Act 2018 and Telangana Panchayat Raj Layout Plan rules G.O. Ms. No. 67 PR&RD dt. 26.02.2002.

This is for information.

Yours faithfully,
Sd/- K.Vidyadhar
Director of Town and Country Planning

//t.c.f.b.o//

Deputy Director


గ్రామ పంచాయతి కార్యాలయం :: చల్లూరు
మండలం: రాజాపేట
జిల్లా: యాదాద్రి భువనగిరి
నోటీసు నెం: C/01/2025
తేది:20/03/2025

రోడ్డున పడ్డ 600 మంది పేదలు రాజపేట మండలం చల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని 322 సర్వే నెంబర్ లో ప్లాట్లు కొనుగోలు చేసారు. ఈ లేఅవుట్ మొత్తం సుమారు 70 ఎకరాలు 24 సెంట్ల విస్తీర్ణంలో ఉండగా,322/4/జె ఏ /7, 322/4/జె ఏ /8, 322/4/జె ఏ /9, 322/4, 211/322/4/సి హెచ్ ఏ , 55, 56, 32/ఏ 27, 30/ఏ /2, 207, 322/4. సర్వే నెంబర్లలో విస్తరించి ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఇట్టి అక్రమ లే అవుటు పూర్తి విచారణ అనంతరం 24 జనవరి 2026 టి ఎల్ పి నెంబర్ 112/2019 హెచ్. లేఅవుట్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ప్రాజెక్టులో శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్, ఆర్.ఆర్ హై ఎనర్జెటిక్స్ లిమిటెడ్, శ్రీకర్ హోమ్స్ సంస్థలు, సిహెచ్ శ్రీకృష్ణ రాజేశ్వరి లు భాగస్వామ్యంగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 నిబంధనలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు లేఅవుట్ అమలు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచనలు జారీ చేశారు. గ్రామపంచాయతీ ద్వారా నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత నాలుగు కంపెనీల వారు స్పందించలేదు.

అనుమతి లేని ప్లాట్ల విక్రయం.....

రాజపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని 322 సర్వే నెంబర్ లో గల అక్రమ వెంచర్ల లోని ప్లాట్లను ప్రభుత్వ అనుమతి లేకపోయినప్పటికీ విక్రయిస్తున్నారు. చల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శి గత ఏడాది మార్చి 20వ తేదీన జారీ చేసిన నోటీసు ప్రకారం 322 సర్వేనెంబర్ లో గల శ్రీకర హోమ్స్, డెవలప్మెంట్ కంపెనీ, శ్రీని డెవలపర్స్, శ్రీ కన్స్ట్రక్షన్స్, సిహెచ్ శ్రీకృష్ణ రాజేశ్వరి లు లేఅవుట్ రెండు సంవత్సరాల కాల పరిమితి ముగిసినందున రెన్యువల్ చేసుకోవాలని కోరారు. కాగా ఇప్పటివరకు సదరు లేఅవుట్ నిర్వాహకులు నోటీసును అందుకొని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్లాట్ల విక్రయాన్ని అక్రమ పద్ధతిలో చేస్తూ అమాయకులైన వారిని మోసం చేస్తూ వస్తున్నారు. ఈ విషయంపై సదరు లేఅవుట్ నిర్వాహకులు తప్పుడు ప్రచారం చేస్తూ అనుమతులు ఉన్నాయంటూ ప్లాట్లు కొనే వారిని మోసం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించకపోతే మరికొందరు అమాయకులు ఆర్థికంగా నష్టపోనున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, నారాయణఖేడ్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని రైతుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులో గల రైతు వేదికలో జుక్కల్ క్లస్టర్ పరిధిలో మే 04 నుండి మే 09 వరకు నిర్వహించనున్న రైతు వారోత్సవాలను ఘనంగా ప్రారంభించిన ఆయన, ఈ సందర్భంగా నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు -- అన్నదాతల అవగాహన సదస్సు"లో మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రవేత్తల సూచనలు పాటించి ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తలు నేరుగా క్షేత్రస్థాయికి వచ్చి సాగు మెళకువలు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించడం శుభపరిణామమని కొనియాడారు. విత్తనం నుండి విక్రయం వరకు ప్రభుత్వం రైతులకు వెన్నంటి ఉంటుందని, రైతు వారోత్సవాల ద్వారా ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాయిల్ టెస్ట్ ల్యాబ్ మంజూరు అయ్యిందని, త్వరలోనే పనులు ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు భూసార పరీక్షలు, యాంత్రీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు వివరించగా, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మమతా బెనర్జీకి బిగ్ షాక్..
# బెంగాల్ కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు ఈసీ నోటిఫికేషన్

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, సెంట్రల్ డెస్క్: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం మమతా బెనర్జీ తన పదవికి రాజీనామా చేయడానికి నిరాకరించడంతో రాజకీయం వేడెక్కింది. ఈ క్రమంలో బెంగాల్ కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలో నూతన శాసనసభ ఏర్పాటుకు భారత ఎన్నికల సంఘం బుధవారం (మే 6, 2026) అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారులు పశ్చిమ బెంగాల్ గవర్నర్ కు పంపారు. దీని ద్వారా రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ముగిసినట్లయింది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం కొలువుదీరడానికి ఈ 'కాన్స్టిట్యూషన్ ఆఫ్ న్యూ అసెంబ్లీ' నోటిఫికేషన్ అత్యంత కీలకమైన దశ.ఈ నోటిఫికేషన్ జారీ తో కొత్త ఎమ్మెల్యేల జాబితా గవర్నర్ వద్దకు చేరుతుంది. దీంతో శాసన సభలో మెజారిటీ సాధించిన పార్టీ, కూటమిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించే అధికారం గవర్నర్‌కు లభిస్తుంది. బీజేపీ ఇప్పటికే అమిత్ షా వంటి అగ్రనేతలను పర్యవేక్షకులుగా నియమించి, మే 9న ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఈ నోటిఫికేషన్ విడుదల కావడం గమనార్హం. ఈ పరిణామంతో బెంగాల్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ఈసీ నిర్ణయంతో తన పదవికి రాజీనామా చేయనని పట్టుబట్టిన మమతా బెనర్జీకి ఊహించని షాక్ తగిలింది.



# పాకిస్థాన్ చేతుల్లోకి చైనా "బ్రహ్మాస్త్రం".. భారత్ కు బిగ్ షాక్..!!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06 :** భారత్ కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాలతో ఎప్పుడూ ప్రమాదమే.. భారత్– చైనా మధ్య ఆక్ సాయ్ చిన్, అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పాకిస్థాన్ తో భారత్ కు ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ 22 న పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అలాగే ఆ దేశంపై పలు కఠినమైన ఆంక్షలను విధించింది. దాంతో ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడంలో పాకిస్థాన్ చైనాపై ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్ పై పాకిస్థాన్ ప్రయోగించిన అనేక డ్రోన్ లు, క్షిపణులు చైనా, టర్కీ నుంచి కొనుగోలు చేసినవే.. ఈ మేరకు భారత్ కు రష్యా ఎలాగైతే ఆయుధాలను సరఫరా చేస్తుందో.. అలాగే పాకిస్థాన్ కు చైనా అదే విధంగా రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తోంది.అయితే చైనా తన అత్యాధునిక జే–35 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలను పాకిస్థాన్ కు అందించేందుకు సిద్ధం అవుతోంది. చైనా ఇటీవల తన అత్యాధునిక జే–35 ఎ ఇ యుద్ధ విమానాన్ని తొలిసారిగా ప్రదర్శనకు ఉంచింది. ఈ మేరకు అంతర్జాతీయ అమ్మకాలకు వాటిని సిద్ధం చేసింది. అయితే పాకిస్థాన్ ఆ అత్యాధునిక యుద్ధ విమానాల్ని కొనుగోలు చేయనుంది. ఈ మేరకు 40 యూనిట్లను కొనుగోలు చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం.గగనతలంలో పాకిస్థాన్ పై భారత్ కు పైచేయి ఉంది. భారత్ వద్ద రాఫేల్, సుఖోయ్ యుద్ధవ విమానాలు ఉన్నాయి. అయితే చైనా పాకిస్థాన్ కు ఐదో తరం జే–35 స్టెల్త్ యుద్ధ విమానాలను అందిస్తే భారత్ కు పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉంది. ఇక అటు పాకిస్థాన్, ఇటు చైనా రెండూ ఐదోతరం యుద్ధ విమానాలను కలిగి ఉండటం వల్ల భారత్ సరిహద్దుల్లో సవాళ్లు మరింతగా పెరుగుతున్నాయి. ఇక ఇటీవల సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఐదోతరం యుద్ధ విమానాల అవసరం ఎంతో ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# నూతన ఐటీడీఏ పీవో మందా మకరందుకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుభాకాంక్షలు



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మందా మకరందును ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్‌లు దిగంబర్, సకారం, చందు, సురేష్, మాణిక్‌రావు, రాహుల్, పైకు, పరమేశ్వర్, రాజంపేట ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు ఊర్వేత రూప్‌దేవ్, మడావి రూప్‌దేవ్, మాజీ ఉప సర్పంచ్ పడ్ విష్ణు తదితరులు పాల్గొన్నారు

# బెండ సిద్ధార్థ వివాహ వేడుకలో పాల్గొన్న హీరేకార్ శ్రీను



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : హైదరాబాదులోని నాగారంలో బుధవారం రోజు జరిగిన భువనగిరి మున్సిపల్ 25వ వార్డ్ కౌన్సిలర్ బెండ లాల్ రాజ్, స్వరూప ల కుమారుడు సిద్ధార్థ వివాహం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరేకార్ శ్రీను పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది, ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట గిరీష్ కుమార్ గౌడ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్ ముదిరాజ్, సంఘం నాయకులు బోయిని బాలయ్య, నరసింహ, మహేష్, సిద్ధులు, గోపే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


# నిర్లక్ష్యంపై ఉపాధి హామీ సిబ్బంది తాత్కాలిక తొలగింపు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కేస్లాగూడ గ్రామంలో పర్కొలేషన్ ట్యాంక్ నిర్మాణంలో హాజరు కాని కూలీలను హాజరైనట్లు నమోదు చేసిన నిర్లక్ష్యంపై మండల అదనపు ప్రోగ్రాం అధికారి జి. మల్లయ్య, సాంకేతిక సహాయకులు బి. అక్యా నాయక్, ఆడే అరవింద్‌లను తాత్కాలికంగా విధుల నుండి తొలగించినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తెలిపారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి విచారణలో నిర్లక్ష్యం నిర్ధారణ అయిన నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తొలగింపు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. వలిపిరెడ్డి నగేష్ ఇంచార్జి ప్రోగ్రాం అధికారిగా, నాగోరావు ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తారని తెలిపారు

# కాగజ్‌నగర్ బస్టాండ్ వద్ద ఆధార్, ఏటీఎం కార్డులు లభ్యం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల బస్టాండ్ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తుల ఆధార్ కార్డులు, ఏటీఎం కార్డులు లభ్యమయ్యాయి. ఏటీఎం ద్వారా నగదు ఉపసంహరించుకున్న తర్వాత కార్డులను అక్కడే మరిచిపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని బస్టాండ్ కంట్రోలర్ దుర్గం లక్ష్మణ్ తెలిపారు. లభ్యమైన కార్డులను భద్రంగా ఉంచినట్లు, సంబంధిత వ్యక్తులు తమ గుర్తింపు వివరాలతో బస్టాండ్ కార్యాలయాన్ని సంప్రదించి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు ఏటీఎం వినియోగ సమయంలో జాగ్రత్తగా ఉండాలని, కార్డులు మరిచిపోకుండా వెంటనే సురక్షితంగా పెట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## శిష్యుడి కుమారుడి టేళ్కో విందుకు దీక్షా గురు ప్రేమసింగ్ మహారాజ్ ఆశీర్వాదం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన రాథోడ్ ఘమాబాయి దేవరావ్ దంపతుల ద్వితీయ కుమారుడు రవీందర్ టేళ్కో విందు వేడుక బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి దీక్షా గురు శ్రీ ప్రేమసింగ్ మహారాజ్, ఏఐబీఎస్ఎస్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ హాజరై నూతన వరుడిని ఆశీర్వదించారు. దేవరావ్ తన ప్రియ శిష్యుడని, కుమారుడి వివాహం చూసి సంతోషంగా ఉందని, ఆ కుటుంబం కలకాలం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మహారాజ్ దీవించారు. బంజారా సమాజం భక్తి, దీక్ష మార్గంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా బంజారా సమాజ పెద్దలు వివాహ వేడుకల్లో వ్యయం తగ్గించి పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జాదవ్ గణపత్ నాయక్, రాథోడ్ ఈశ్వర్, రాథోడ్ నారాయణ, మోతిలాల్ మహారాజ్, నర్సింగ్ సేవాలాల్, ఆడే బాలు, ఆడే తుకారం, జాదవ్ రమేష్, ఆడే కిషన్, మెస్రం అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజల సేవే లక్ష్యం... ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి: ఎస్పీ డా. శబరీష్




హైదరాబాద్ పల్స్, మే 06, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి: పోలీస్ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కావాలంటే అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, తెలిపారు. బుధవారం నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ డాక్టర్ శబరిష్ అక్కడి పరిసరాలు, రికార్డులు, విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి పనితీరును సమీక్షించారు. విధి సమయంలో ప్రతి పోలీస్ సిబ్బంది స్టేషన్‌లో తప్పనిసరిగా ఉండాలని, ప్రజలు సులభంగా పోలీసులను సంప్రదించేలా సేవలు అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు విచారణను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వెంటనే స్పందించాలని సూచించారు. బీట్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేస్తూ గ్రామాల్లో నేర నియంత్రణకు కృషి చేయాలని, సీసీటీవీ కెమెరాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బి. వెంకన్న స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య పరిష్కారానికి హామీ

**చిట్టరేట్, సోయంగూడ గ్రామాల్లో పర్యటించిన అజ్మీరా శ్యామ్ నాయక్**




**హైదరాబాద్ ఫస్ట్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం వెల్గి గ్రామ పంచాయతీ పరిధిలోని చిట్టరేట్, సోయంగూడ ఆవాస గ్రామాల్లో బుధవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ పర్యటించి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రధానంగా త్రాగునీటి సమస్యను గ్రామస్థులు దృష్టికి తీసుకురాగా, వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాంకిడి మండల కాంగ్రెస్ నాయకులు, ఉప సర్పంచ్ దీపక్ ముండే, సీనియర్ నాయకుడు ఎం.డీ. నిజాం, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమార్కులపై చర్యల్లో పక్షపాతం ఎందుకు.? : ఆకుల సతీష్



కుత్బుల్లాపూర్, మే 06, హైదరాబాద్ పల్స్ న్యూస్ : కుత్బుల్లాపూర్ బాచుపల్లి మండలం పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 454లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి సుమారు 300 గజాలను రోడ్డుగా వినియోగిస్తున్న ఆకృతి కన్స్ట్రక్షన్‌పై ఇప్పటివరకు క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, సర్వే నెంబర్ 83గా చూపిస్తూ ఆస్టలుమియా స్కూల్ నిర్మాణానికి అనుమతులు తీసుకున్నప్పటికీ, వాస్తవానికి సర్వే నెంబర్ 82లోని సుమారు 20 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిపై అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. పక్కనే ఉన్న మరో ఆక్రమణపై మాత్రం వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసిన అధికారులు, ఆకృతి కన్స్ట్రక్షన్ విషయంలో ఎందుకు అదే విధంగా వ్యవహరించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ ఆర్థిక అండదండలు ఉన్నవారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 454 మొత్తానికి ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ అధికారులు జనవరిలో హైడ్రాకు లేఖ రాసినప్పటికీ, ఇప్పటివరకు ఫెన్సింగ్ పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఇదే విధంగా, సర్వే నెంబర్ 83లో 2700 గజాల్లో స్కూల్ నిర్మాణానికి అనుమతులు తీసుకొని, సర్వే నెంబర్ 82లో సుమారు 2200 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం పూర్తి చేసి స్కూల్ ప్రారంభించారని ఆరోపించారు. అప్పటి ఎమ్మార్వో పూల్ సింగ్, మున్సిపల్ అధికారుల సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణం పూర్తయిందని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఫిబ్రవరిలో నోటీసులు ఇచ్చినా, ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలో, అక్రమార్కులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రజా అవసరాలకు వినియోగించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, పాండు, ఎల్ల స్వామి, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## బంజారా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**పీఠాధిపతి బాబూసింగ్ మహారాజ్**

**లింగాపూర్‌లో సేవాలాల్ మహారాజ్ భోగ్ భండార్ కార్యక్రమం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రంలో బుధవారం జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ తపస్వి డాక్టర్ రామారావ్ మహారాజ్ భోగ్ భండార్ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. అఖిల భారత బంజారా సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పొవరా దేవి పీఠాధిపతి శ్రీ బాబూసింగ్ మహారాజ్ లింగాపూర్ గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. బంజారా సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భక్తి-ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలని పిలుపిచ్చారు. సేవాలాల్ మహారాజ్ బోధనలను అనుసరించి ఇతరులతో గౌరవంగా మెలగాలని, అబద్ధాలు, దొంగతనాలు, గుడుంబా వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని పెళ్లిళ్లు-శుభకార్యాలలో అనవసర ఖర్చులు తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయక్ రాథోడ్ కిరణ్ నాయక్, కారోబారి రాథోడ్ శివలాల్, సర్పంచ్ జాదవ్ రాజశేఖర్, మందిర పూజారి రాథోడ్ మంగులాల్ మహారాజ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ధర్మ ప్రచారకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాతృశ్రీకి ఎంపీ నివాళులు..!

**పీఠాధిపతులకు పరామర్శ**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, జహీరాబాద్ : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి చెందిన మాతృమూర్తి మాతృశ్రీ అనసూయ మాత మంగళవారం శివైక్యం చెందిన విషయాన్ని తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ ఆశ్రమాన్ని సందర్శించి మాతృశ్రీ సమాధి మందిరంలో ప్రత్యేకంగా నివాళు లర్పించారు. జహీరాబాద్, కోహిర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆశ్రమానికి వచ్చిన ఎంపీ, ముందుగా అనసూయ మాత సమాధి మందిరాన్ని దర్శించుకుని పుష్పాంజలి ఘటించి నివాళు లు అర్పించారు. అనంతరం అమ్మవారి ఆధ్యాత్మిక సేవలను, భక్తులకు అందించిన మార్గదర్శకత్వాన్ని స్మరించుకున్నారు. అవధూత గిరి , సిద్దేశ్వరనందగిరిఎంపీ పరామర్శించి ధైర్యం చెప్పారు. అమ్మ జ్ఞాపకాలు ఎప్పటికీ భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆమె చేసిన సేవలు అందరికీ ఆదర్శమని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఉదయ శంకర్ పాటిల్, వేణుగోపాల్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, కోట శ్రీనివాస్, బి కృష్ణ, వడ్ల సంగమేశ్వర్, బోయి ఎల్లన్న, తదితరులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


## చేతికొచ్చిన పంట... ప్రకృతి కన్నెర్ర...

**ఈదురు గాలుల వడగండ్ల వాన తెచ్చిన కడగండ్లు**

**అధికారుల నిర్లక్ష్యం అన్నదాతలకు నష్టం**

**వరి, మామిడి రైతులకు కోలుకోని దెబ్బ**

**అరగంటలో అతలాకుతలం**





హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలంలో ఈదురు గాలుల వడగండ్ల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. కోట్ల రూపాయల వరి మామిడి వంటలు ధ్వంసమయ్యాయి. చేతికొచ్చిన పంట డబ్బు రూపంలో ఇంటికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసి రైతుల కుటుంబాల్లో మట్టి కొట్టింది. మంగళవారం రాత్రి అరగంట కురిసిన ఈదురు గాలుల వడగండ్ల వాన రైతులకు నష్టాన్ని కష్టాన్ని తెచ్చి పెట్టింది. అప్పులు చేసి ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట నాశనమైపోవడంతో రైతు



కుటుంబాల్లో కన్నీరే మిగిలింది. అధికారులు నిర్లక్ష్యం పాలకులు పట్టింపు లేని తనం కారణమంటూ రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. మంగళవారం రాత్రి 10:30 నుండి 11 గంటల వరకు అరగంట పాటు అకస్మాత్తుగా భారీ ఈదురగాలుల వడగండ్ల వర్షం రావడంతో కోతకు ఉన్న వరి పంట నేలరాలిపోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రాశులుగా పోసిన కుప్పలు నష్టాలను తెచ్చిపెట్టడం, మామిడి తోటలోని నేల కాయలతో పరిచినట్లుగా రాలిపోవడం జరిగింది. అదే రాత్రి అన్నదాతల కుటుంబం పంటల దగ్గరికి వెళ్లి చూసి మట్టిలో కలిసిన చేతికొచ్చిన పంట చూసి లబోదిబోమంటూ రోదించారు. అధికారుల పాలకుల పట్టింపులేనితనాన్ని విమర్శిస్తూ నోటికొచ్చినట్టుగా దూషణలు చేశారు. ప్రధానంగా సింగారం గ్రామ పరిధిలో ఈ ప్రభావం ఎక్కువగా ఉండడంతో చేనులోని పంట, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న 150 కి పైగా ధాన్యం రాశులు, నర్సాపురం పరిధిలో మామిడి తోటలోని చెట్ల కాయలు రాలిపోవడం పరిస్థితిని చూసినవారు అయ్యో పాపం అన్నారు.

హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక



# గోవుల అక్రమ రవాణాకు తావులేకుండా జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టుల నిర్వహణ

**చెక్‌పోస్టులను అకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:
ఈ సందర్భంగా చెక్ పోస్ట్ ల పనితీరును పరిశీలించారు. చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలు మరియు అనుమానాస్పద మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపడుతున్నామని, గోవుల అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టప్రకారం కేసులు నమోదు చేసి న్యాయపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**
గోవుల అక్రమ రవాణా గురించి ఎలాంటి సమాచారం ఉన్నా సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు తెలియజేయాలని సూచించారు. సమాజంలో చట్టం, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత ఇంజ మహేష్ ను సన్మానించిన ఎంపీడీవో



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు, మరోవైపు తోటి కార్మికుల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసి, మే 1న కార్మికుల దినోత్సవం సందర్భంగా శ్రమశక్తి అవార్డు అందుకున్న ఇంజ మహేష్ ను రాజపేట మండల ఎంపీడీవో ఏ.నాగవేణి శాలువాతో ఘనంగా సత్కరించి, ముందు ముందు మరెన్నో అవార్డులు అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్, ఎండి ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ సంపత్, కంప్యూటర్ ఆపరేటర్స్, దీకొండ గణేష్, నరేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. మహేష్ ఎంపీడీవో కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అన్నదాన సత్రంపై నోటీసులు...

**సేవలకు అడ్డంకి వద్దు.. మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న అన్నదాన సత్రానికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడంపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిరోజూ వందలాది మంది పేదలకు అన్నదానం, వేసవిలో అంబలి పంపిణీ జరుగుతున్న ఈ సేవను అడ్డుకోవడం తగదన్నారు.మరోవైపు మున్సిపాలిటీ ప్రకారం సత్రం కోసం కేటాయించిన సుమారు 800 చదరపు గజాల భూమి లీజు గడువు 11-10-2025తో ముగిసిందని అదనంగా ఎక్కువ భూమి వినియోగం, చేశారు అంటూ రూ.1,53,993 అద్దె బకాయిలు 7 రోజుల్లో చెల్లించి స్థలం ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో ప్రజలకు ఉపయోగపడే ఈకార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అధికారులే నోటీసులతో అడ్డుకోవడం అన్యాయమని కోనప్ప పేర్కొన్నారు. నోటీసుల కారణాలను స్పష్టంగా వెల్లడించాలని, సమస్య ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు అధికారులు సహకరించాలని డిమాండ్ చేశారు.

## బైకనీ రాజయ్య కుటుంబానికి కురుమ సంఘం ఆర్థిక సాయం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం చల్లూరు గ్రామంలో బైకనీ రాజయ్య అనారోగ్యంతో మరణించగా కురుమ సంఘం సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. కురుమ సంఘం నుండి అధ్యక్షులు దిడ్డిగ రమేష్, కుల పెద్దలు మీసా బాలయ్య, మీసా కిష్టయ్య ల ఆధ్వర్యంలో 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కేటీఆర్ రైతులకు బేడీలు వేసిన చరిత్ర మీది కాదా... ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య






హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం కంటంగూడెం గ్రామం మరియు గుండాల మండలం పెద్దపడిశాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ప్రతిపక్షాలు తిన్నది అరగక ధర్నా చేస్తున్నారని హెద్దవా చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించిన రైతు సభలో ప్రజాపాలన ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను బీర్ల ఐలయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.... రైతుల సమస్యలపై మళ్ళీ ముసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కేటీఆర్ పై మండి పడ్డారు. గత పది సంవత్సరాల పాటు రైతులను పూర్తిగా విస్మరించిన వారు, ఇప్పుడు రైతు సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంతా కలసి కేటీఆర్‌ను తిరస్కరించి అధికారంలో నుండి దింపిన తర్వాత కూడా ఆయన అహంకారం తగ్గలేదని పేర్కొన్నారు. వరంగల్‌లో రైతు సభ ఏర్పాటు చేసి రైతులను ఉద్ధరించినట్లు మాట్లాడటం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. కేటీఆర్ తగిన అవగాహన లేకుండా బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్ సందర్భంగా భావి ప్రధాని రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు హామీల మేరకు రైతులకు రుణమాఫీ అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వరంగల్ డిక్లరేషన్ సాక్షిగా రైతులంతా కేటీఆర్‌ను తిరస్కరించి ఫామ్ హౌస్ రాజకీయాలకు పరిమితం చేసినా ఆయనకు ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. గతంలో రైతులకు బేడీలు వేసిన వారు మీరు కాదా అని ప్రశ్నిస్తూ, అప్పులు చేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన మీ తప్పులను మేము ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయడం ద్వారా ప్రభుత్వ నిబద్ధతను చాటుకున్నామని తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ఏ ముఖం పెట్టుకొని వరంగల్‌లో రైతు సభ నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల పట్ల ప్రజాపాలన ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటును ప్రజలు విశ్వసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు చిల్లర మాటలు మాట్లాడుతున్నాయని విమర్శించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని గౌరవించకుండా అనవసర వ్యాఖ్యలు చేయడం అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు అందరూ ప్రజాపాలన ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు అసహనంతో వ్యవహరిస్తున్నాయని అన్నారు. మీ ప్రభుత్వం కూలిపోయిన తరువాత జరిగిన ఏ ఎన్నికలోనూ విజయం సాధించలేకపోయినా మీ ధోరణి మారలేదని, ప్రజలు నిజాన్ని గుర్తించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారని స్పష్టం చేశారు.ఖ

## వంతెన పనుల వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

**దిందా గ్రామంలో కలెక్టర్ పర్యటన**




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతనమానేపల్లి మండలం దిందా గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. దిందా గ్రామంలో కలెక్టర్ పర్యటన వంతెన పనుల వేగవంతం ఆదేశందిందా-కేతిని గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పనులను పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం ప్రాణహిత నదిని పరిశీలించి, గ్రామస్థులతో నీటి పరిస్థితులు, అవసరాలపై చర్చించారు. గ్రామానికి కలెక్టర్ పర్యటన రావడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పనుల్లో ఇనుప పెట్టె కూలి మహిళ మృతి




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామంలో విషాద ఘటన జరిగింది. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో భాగంగా పిల్లర్‌కు అమర్చిన ఇనుప పెట్టె అకస్మాత్తుగా కూలిపోవడంతో సుగుణ (45) అనే ఇంటి యజమానురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. నిర్మాణ పనుల్లో భద్రతా లోపాలే ప్రమాదానికి కారణమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇందిరమ్మ ఇల్లుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 06, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువంగిర్ జిల్లా, యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట, కంటంగూడెం, పెద్ద కందుకూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. మాసాయిపేట గ్రామానికి చెందిన కళ్లెం బాలమణి, కంటంగూడెం గ్రామానికి చెందిన కవిత బాలకిషన్, పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన వట్టిపల్లి భరత్, రుద్ర నిర్మల వెంకటేష్ లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి పట్టు బట్టలు అందజేసి, యాట పొట్టేలు బహుమతిగా ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ....ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించబడుతోందని అన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కలగాలని ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా



సమాజంలో ఆర్థిక, సామాజిక స్థిరత్వాన్ని పెంచుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.